క్లుప్తంగా

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఐ వెంకటరామిరెడ్డి

గుత్తి: త్రైత సిద్ధాంతం ఉగాది నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సీఐ వెంకటరామిరెడ్డి తన చాంబర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఎంఈఓ, ఎంపీడీఓ, మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ తదితరులకు త్రైత సిద్ధాంత కార్యకర్తలు క్యాలెండర్లను అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని జెండా వీధి, కోటలోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సీడీపీఓ నాగమణి, ఏసీడీపీఓ డిల్లీశ్వరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పిల్లల హాజరు జాబితాను పరిశీలించారు. సెంటర్లలో ఎంత మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు? అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లలకు నులి పురుగుల మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


అశ్వత్థంలో బియ్యం, బేడల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా భక్తులు అశ్వత్థనారాయణ స్వామికి సమర్పించిన బియ్యం, బేడలను మంగళవారం అధికారులు బహిరంగవేలం వేశారు. దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారి రమేష్ బాబు వేలం నిర్వహించగా అనంతపురానికి చెందిన ఆనందగుప్త అనే వ్యాపారి కిలో రూ.28 చొప్పన వేలం దక్కించుకున్నారు. గతేడాది కిలో రూ.16 మాత్రమే ధర పలికిందని ఈ ఏడాది రెట్టింపు ఆదాయం వచ్చినట్లు ఈఓ సుబ్రహ్మణ్యం, ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత మృతి



అల్లా బకాష్(ఫైల్)

గుత్తి: పట్టణంలోని కమాటం వీధికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అల్లా బకాష్(70) మంగళవారం మృతి చెందాడు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అల్లా బకాష్ మృతి పట్ల మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, మాజీ సర్పంచు పీరా, కౌన్సిలర్ ఫరూక్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ తదితరులు సంతాపం ప్రకటించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



చెక్కు అందిస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

తాడిపత్రి టౌన్: సీపీఐ కాలనీకి చెందిన నగరూర్ బాబు క్యాన్సర్‌తో సోమవారం మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం క్రింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేల చెక్కును వార్డు అడ్మిన్ నరేష్‌కుమార్‌రెడ్డి, వెల్ఫేర్ సెక్రటరీ కేశవ, సచివాలయ ఉద్యోగులు మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పుట్లూరు: మండలకేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. కంబగిరి అనే వ్యక్తి కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఈక్రమంలో నొప్పితాళలేక మంగళవారం క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పంట నమోదు వివరాలు సరి చూసుకోండి

శింగనమల: మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ రబీ కింద సాగు చేసిన పంట వివరాలు నమోదు జాబితాలను ప్రదర్శించామని, రైతులు వాటిని సరి చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి చిన్నమ్మ తెలిపారు. మండలంలోని శింగనమల, సోదనపల్లి, సలకంచెరువు, రాచేపల్లి, తరిమెల, కల్లుమడి, ఆకులేడు, లోలూరు, వెస్ట్ నరసాపురం, చక్రాయిపేట, పెరవలి, కొరివిపల్లి, ఉల్లికల్లు సచివాయల్లో జాబితాలు ప్రదర్శించామన్నారు. రైతులు సాగు చేసిన పంట వివరాలు, సర్వే నంబర్లు, ఆధార్ నంబర్లు తప్పుగా ఉన్న, వాటిని సరి చేసుకోవాలని కోరారు.

అరటి..లాభాల్లో మేటి!



లక్షుంపల్లెలో సాగైన అరటి తోట

యాడికి: అరటి సాగుతో రైతులు లాభాలు గడిస్తున్నారు. అరటికి ఎక్కువగా డిమాండ్ ఉండడం, స్థానికంగానే మార్కెట్ లభిస్తుండడంతో పంట సాగుకు మక్కువ చూపుతున్నారు. మండలంలో 500 మంది రైతులు దాదాపు 1,500 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నట్లు ఉద్యాన అధికారులు చెబుతున్నారు. మామిడి, సపోటా, నిమ్మ, చీనీ తదితర పండ్ల తోటల మధ్యలో అంతర పంటగా అరటిని సాగు చేస్తున్నారు.

ఎకరాకు 30 నుంచి 35 టన్నుల వరకు దిగుబడి

ప్రస్తుతం రైతులు ఎక్కువగా గ్రాండ్ నైన్ రకం మొక్కలు నాటుతున్నారు. ఇవి ఎకరాకు 1,150 మొక్కలు సరిపోతాయి. అవి నాటిన ఆరు నెలల నుంచి 2 – 3 ఏళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఏడాదిలో 35 టన్నుల దిగుబడి వస్తుంది. టన్ను అరటి ధర రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుంది. రైతుల వద్దకే వెళ్లి వ్యాపారులు గెలలను కొనుగోలు చేస్తున్నారు. అరటికి వ్యాధుల బెడద తక్కువగా ఉండటంతో రైతులకు కలిసి వస్తోందని ఉద్యాన శాఖాధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

అరటి సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది. మొదటి ఏడాది హెక్టారుకు రూ.30 వేలు, రెండో ఏడాది హెక్టారుకు రూ.10 వేల దాకా సబ్సిడీని ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందజేస్తోంది. ఈ మొత్తాన్ని కూడా మొక్కలు, ఎరువులకు ఉపయోగించుకునే విధంగా ప్రభుత్వం ప్రోత్సాహిస్తోంది.

- మండలవ్యాప్తంగా 1500 ఎకరాల్లో పంట సాగు
- స్థానికంగానే మార్కెట్
- అధిక దిగుబడి సాధిస్తున్న రైతులు

దిగుబడి, ధర బాగుంది



నేను 4 ఎకరాల్లో అరటి పంటను సాగు చేశాను. మరో ఇరవై రోజుల్లో పంట కోతకు వస్తోంది. దాదాపు 100 టన్నుల వరకు దిగుబడి వస్తుందనుకుంటున్నా. ప్రస్తుతం టన్ను రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంది. పంట దిగుబడితోపాటు ధర బాగుండటంతో లాభాలు బాగానే ఉంటాయనుకుంటున్నా.

–గంపిరెడ్డి, కేశవరాయుని పేట, యాడికి మండలం

రైతులకు సలహాలిస్తున్నాం



అరటి లాభదాయకమైన పంట. అరటి సాగులో మొక్క మొక్కకు మధ్య ఆరు అడుగులు దూరం పాటిస్తే పంటకు సిగటోక తెగులు రాదు. ప్రధానంగా వైరస్‌లు రాకుండా రైతులకు సూచనలు ఇచ్చి మందులు పిచికారీ చేయిస్తున్నాం. పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది.

–ఉమాదేవి, తాడిపత్రి ఉద్యాన శాఖ అధికారిణి

నేడు వేంకటేశ్వరస్వామి రథోత్సవం

యల్లనూరు: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకుడు విజయ్ తెలిపారు. మంగళవారం వేంకటరమణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భగవద్గీతపై అవగాహన

గార్లదిన్నె: పెనకచెర్ల, పి.కొత్తపల్లిలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు జీవాత్మ, ఆత్మ ,పరమాత్మ అంశాలను వివరించారు. సర్వ మతాలకు దేవుడు ఒక్కడే అన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం హిందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు రవి కుమార్, సభ్యులు రామకృష్ణ, భాస్కర్‌రెడ్డి , చిరంజీవి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పథకాలు అందించండి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ ఓబులమ్మ

గుంతకల్లు: అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలని అనంతపురం డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఓబులమ్మ సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆమె పాతకొత్త చెరువు, ఎన్.తిమ్మాపురం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల అటెండెన్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌డీజీ సర్వేపై ఆరా తీశారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు ఎంత మందికి జారీ చేశారని అడిగి తెలుసుకున్నారు. ఎన్‌డీడీ (నేషనల్ డీవార్మింగ్ డే) పోగ్రామ్‌పై విద్యార్థులు, తల్లి తండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తాడిపత్రిటౌన్ : పట్టణంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సీసీ కెమెరాల నిఘా మధ్య పరీక్షలు జరగనున్నాయి. పట్టణంలోని 5 కేంద్రాల్లో జరిగే ఇంటర్ ఫస్టియర్ తెలుగు లేదా సంస్కృతం పరీక్షకు 1,245 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 279 మంది, మోడల్ స్కూలులో 256 మంది, సీవీరామన్ జూనియర్ కళాశాలలో 224 మంది, టెక్ జూనియర్ కళాశాలలో 238 మంది, వాణి జూనియర్ కళాశాలలో 248 మంది పరీక్ష రాస్తారన్నారు. అన్ని కేంద్రాల్లో బెంచీలమీద పరీక్షలు రాసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం 8–15 గంటలకు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 9 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని అధికారులు తెలిపారు.

పామిడి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు చీఫ్‌గా సుబ్రహ్మణ్యం, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా నాగరాజు వ్యవహరించనున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు పామిడి, గార్లదిన్నె విద్యార్థులు 306 మంది హాజరుకానున్నారు. 9 గంటలు దాటి నిమిషం ఆలస్యం అయినా విద్యార్థులను పరీక్షా హాల్‌లోనికి అనుమతించమని పరీక్షా కేంద్రం చీఫ్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

తక్కువ నీటితో డ్రాగన్ ఫ్రూట్ సాగు



డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి రఘునాథ్‌రెడ్డి

యల్లనూరు: తక్కువ నీటితో డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేయొచ్చని జిల్లా ఉద్యాన అధికారి రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన గొడ్డుమర్రి గ్రామానికి చెందిన లోకేష్ సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలించారు. దంతలపల్లిలో ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన ప్యాక్‌హౌస్‌ను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌తో సంబంధం లేకుండా డ్రాగన్ ఫ్రూట్ అన్ని రకాల నేలల్లో సాగు చేయొచ్చన్నారు. అరటి, చీనీ , దానిమ్మతో పాటు డ్రాగన్ ఫ్రూట్ పంటను రైతులు విరివిగా సాగు చేసుకోవచ్చని చెప్పారు. ఏడీహెచ్ నరసింహరావు, హార్టికల్చర్ అధికారిణి ఫజులున్నీసాబేగం ఉన్నారు.

నెలాఖరులోగా పన్ను వసూలు చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ బండి శేషన్న

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆస్తి, నీటి పన్ను బకాయిలను నెలాఖరులోగా వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన వార్డు అడ్మిన్, ఎమెనిటీ సెక్రటరీలతో పాటు నాన్ పీహెచ్ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పన్ను వసూలులో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. సకాలంలో పన్నులు చెల్లించకపోతే అభివృద్ధికి కుంటుపడుతుందని ప్రజలకు వివరించాలన్నారు. వాటర్‌వర్క్స్ సిబ్బంది లీకేజీలు, ఇతర తాగు నీటి సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని కమిషనర్ ఆదేశించారు. ఆర్‌ఓ నాసిర్‌హుసేన్, ఆర్‌ఐ ఎర్రిస్వామి, ఏఈలు శ్రీకాంత్, షబానా, ఎల్‌ఎస్.బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి ఆర్డీటీ కృషి



మాట్లాడుతున్న హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి

పెద్దవడుగూరు : మహిళల అభ్యున్నతికి ఆర్డీటీ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని ఆర్డీటీ హౌసింగ్ విభాగం డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఏటీఎల్ నారాయణ పేర్కొన్నారు. మంగళవారం క్రిష్టిపాడు ఎస్సీ కాలనీలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మహిళలు అభివృద్ధి వైపు నడవడానికి ఆర్డీటీ సంస్థ చేపడతున్న కార్యక్రమాలను వివరించారు. గ్రామీణ ప్రాంతాలల్లో బాల్య వివాహాలు జరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలు, బాలికల పై దాడులను అరికట్టడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సీఓ నాగమణి, సిబ్బంది, సీడీసీ మెంబర్లు పాల్గొన్నారు.

నాటుసారా తరలిస్తున్న మహిళ అరెస్టు

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై నాటుసారా తరలిస్తున్న భూలక్ష్మి అనే మహిళను మంగళవారం సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపేట గ్రామ శివారులో ఓవర్ బ్రిడ్జి వద్ద సెబ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. భూలక్ష్మి అనే మహిళను ఆపి తనిఖీ చేయగా ఆమె వద్ద ఉన్న సంచిలో నాటుసారా ఉన్నట్లు గుర్తించారు. ఆమెను అరెస్ట్ చేసి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ అలీ అహ్మద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. మండలంలో ఎక్కడైనా నాటుసారా అమ్మితే సమాచారం అందించాలని సెబ్ పోలీసులు కోరారు.

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గుత్తి రూరల్: బాచుపల్లి–ధర్మాపురం గ్రామాల మధ్యలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పొలిమేర పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలను తలపై ఉంచుకొని ఆలయం వరకూ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. సర్పంచ్ మక్కెల చంద్ర, బీజేపీ అసెంబ్లీ కో–కన్వీనర్ తెగదొడ్డి తిమ్మారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చౌదరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం



వేదగాయత్రి (ఫైల్)

తాడిపత్రి అర్బన్: స్థానిక రాగితోట పాలెంకు చెందిన దివాకర్‌బాబు కుమార్తె వేదగాయత్రి కనిపించకుండా పోయింది. తిరుపతిలోని శ్రీవిద్యా నికేతన్‌లో బీసీఏ చదువుతున్న ఆమె ఈ నెల 7న తాడిపత్రిలోని ఇంటికి వచ్చింది. అదే రోజు సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై దాడి

యాడికి: విధులు ముగించుకొని కారులో తోటి ఉపాధ్యాయులతో కలిసి తాడిపత్రికి వెళ్తున్న ఉపాధ్యాయుడిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు..రాయలచెరువుకు చెందిన రవికుమార్ యాడికి ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పనిచేస్తూ తాడిపత్రిలో ఉంటున్నాడు. మండల కేంద్రంలోని కోన రోడ్డులో బంధువుల హోటల్‌కు పోయి టీ తాగుతూ ఉండే వాడు. అయితే మండల కేంద్రానికి చెందిన బద్రీ అనే టైలర్ టీచర్ రవి కుమార్‌ను ఆ హోటల్‌కు పోకూడదని గతంలో గొడవ పడ్డాడు. అప్పటి నుంచి రవి కుమార్ ఆ హోటల్‌కు పోవడం లేదు. మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి తన సహచర ఉపాధ్యాయులతో కలిసి తన కారులో తాడిపత్రికి బయలుదేరాడు. వేములపాడు సమీపంలోని కస్తూర్బా పాఠశాల వద్ద వేములపాడుకు చెందిన రాజ్ కుమార్‌తో పాటు మరో నలుగురు కారును ఆపి మా మామ బద్రీ చెప్పినా కూడా నీవు కోన రోడ్డులో ఉన్న హోటల్‌కు పోతావా అంటూ రవికుమార్‌పై దాడి చేశారు. తర్వాత కారు అద్దాలను పగులగొట్టారు. బాధితుడి ఫర్యాదు మేరకు బద్రీ,రాజ్‌కుమార్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

విజయవంతంగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

గుత్తి రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలను అధికారులు విజయవంతంగా నిర్వహించారని, వారి పనితీరు ప్రశంసనీయమని రాయలసీమ విమోచన సమితి జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బసినేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ వ్యాప్తంగా జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్కడా చిన్న సంఘటన జరగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకున్నారన్నారు. పోలింగ్ అధికారులు ఎక్కడా పోలింగ్ ప్రక్రియకు ఆటంకం కలగకుండా సజావుగా పూర్తి చేశారన్నారు. అలాగే 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో 95 శాతం ఓటింగ్ జరిగేలా ఓటర్లు అందరూ కృషి చేయాలన్నారు. నాయకులు సుబ్బయ్య ఆచారి, విజయ్‌కుమార్, వెంకటేశ్వరరెడ్డి, గుత్తి సోషల్ మీడియా కన్వీనర్ గాదిలింగ, కో–కన్వీనర్ దేవేంద్ర, శివశంకర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

గుత్తి: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా జరగడంతో సామాజిక కార్యకర్త పవన్ యాదవ్ నేతృత్వంలోని సామాజిక కార్యకర్తల బృందం సీఐ వెంకటరామిరెడ్డిని సన్మానించారు. సీఐ చాంబర్‌లో మంగళవారం వారు ఆయన్ను శాలువాలు, పూల మాలలతో సత్కరించారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ

తాడిపత్రి టౌన్: విశాఖపట్నం జిల్లా ఎలమంచిలిలో ఈనెల 11, 12, 13వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తాడిపత్రి క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబర్చారు. సబ్ జూనియర్ విభాగంలో 5 బంగారు, 3 రజిత, 10 కాంస్య పతకాలను సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. దీంతో వారిని నిర్వాహకులు ఈనెల 27, 28, 29 తేదీల్లో జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక చేశారు. లోకేష్‌రెడ్డి, షెక్షావలి, భవిష్య ప్రణవ్, శబరీష్, బంగారు , సహస్ర, యశ్వంత్, లక్ష్మీ చరణ్ రజత పతకాలు, అనిత, శ్రీవిద్య, శివతేజ, సాయిదీప్తి, సుభిక్షత కాంస్య పతకాలను సాధించారు. మంగళవారం వారిని కోచ్ సాయిబాబా అభినందించారు.



పతకాలు సాధించిన తాడిపత్రి తైక్వాండో క్రీడాకారులు

పనుల నాణ్యతలో రాజీ పడొద్దు



బొప్పేపల్లిలో నూతన భవనాన్ని పరిశీలిస్తున్న ఈ ఈ రవి

యల్లనూరు: ప్రభుత్వ భవనాల నిర్మాణంలో నాణ్యతలో రాజీ పడొద్దని పంచాయతీరాజ్ ఈఈ రవి కాంట్రాక్టర్లకు సూచించారు. మంగళవారం మండలంలోని బొప్పేపల్లి, బుక్కాపురం, తిమ్మంపల్లి, గొడ్డుమర్రి, దంతలపల్లి, గడ్డంవారిపల్లి, యల్లనూరు తదితర గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టర్లు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలిను అందించారు. అన్ని భవనాలు బాగున్నాయని జేఈ నరేంద్రబాబును అభినందించారు.

నులిపురుగుల నిర్మూలనతో రక్తహీనత దూరం



శింగనమల : కేజీబీవీలో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ యుగంధర్

శింగనమల: నులి పురుగుల నిర్మూలనతో పిల్లల్లో రక్తహీనత దూరమవుతుందని, ప్రతి విద్యార్థికి అల్బెండజోల్ మాత్రలు వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్.యుగంధర్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం శింగనమలలోని కేజీబీవీలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 6 నెలలకొకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, సీడీపీఓ ఉమాశంకరమ్మ, తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి ఫిర్దోస్, సీహెచ్‌ఓ శివప్రసాద్, ఎస్‌ఓ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: యల్లనూరు, తిమ్మంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిధిలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ఆల్‌బెండజోల్ మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీపీ గంగాదేవి, వైద్యులు లోకేష్, కీర్తన, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ కొండన్న, ప్రధానోపాధ్యాయులు పరమేశ్వరరెడ్డి, మనోహర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిమ్మంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాల్ పోస్టర్లను వైద్యురాలు కీర్తన విడుదల చేశారు. ఎంపీహెచ్‌ఈవోలు మధుకుమార్, వీరనారాయణ, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రాము, ఏఎస్‌ఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: మండల వ్యాప్తంగా 13,460 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ కాశెప్ప తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం యాడికి ఉన్నత పాఠశాలలో వారు వైద్య సిబ్బందితో కలిసి నులి పురుగుల నివారణ మాత్రలు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 18 వరకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు.

తాడిపత్రి టౌన్: పట్టణ, రూరల్ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1–19 ఏళ్లలోపు 27,520 మంది పిల్లలకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు ఎంఈఓ నాగరాజు తెలిపారు. నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమం చేపట్టామన్నారు. పట్టణ ,రూరల్ పరిధిలో 32,036 మందికిగాను 80 శాతం పిల్లలకు మాత్రలు వేసినట్లు ఆయన తెలిపారు.

బుక్కరాయసముద్రం: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులతో పాటు పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల డాక్టర్ స్వాతి లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పిల్లలకు వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రల వేశారు. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పద్మప్రియ, ఎంపీడీఓ తేజోత్స్న, ఎంఈఓ గురుప్రసాద్, బీకేఎస్ హైస్కూల్ హెచ్‌ఎం సుమంగళి, సీహెచ్‌ఓ మోహన్ రావు పాల్గొన్నారు.

నార్పల: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల వ్యాప్తంగా ఉన్న 11,950 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలో మంగళవారం 96 శాతం మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేసినట్లు వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో 5,070 మంది విద్యార్థులు ఉండగా 4867 మంది విద్యార్థులకు మాత్రలను వేశామన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో 19 ఏళ్లలోపు పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలు మింగించారు.

పామిడి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్ తెలిపారు. మొత్తం 3,603 మందికి గాను 3,386 మంది విద్యార్థులకు మాత్రలు వేశామన్నారు.

శ్రీశ్రీ కళావేదిక అధికార ప్రతినిధిగా హరి

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన కవి గుత్తా హరిసర్వోత్తమ నాయుడును శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు కళావేదిక వ్యవస్థాపకులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.